

## కథ

### కె.బి.కృష్ణ

# శ్రీవారూ-వెన్నచెక్కలూ

“ఏమోయ్ నీకు ఈరోజు నుండి నేను వంటింట్లో సాయం చేయాలనుకుంటున్నాను. రోజూ నేను ఉదయం ఆఫీసుకు వెళ్ళేవరకూ, సాయంత్రం ఇంటికి వచ్చేక, రాత్రి పడుకునే వరకూ నువ్వు పడుతున్న శ్రమ చూడలేకపోతున్నాననుకో” అన్నారు శ్రీవారు ఆవేళ ఉదయం బ్రష్ చేసుకోగానే. చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రిగా ఎన్నికైనట్లు వార్త విన్నదానిలాగా భయం, ఆశ్చర్యంతో అసలే పెద్దకళ్ళేమో నావి, మరింత విప్పారేయి. ఎందుకంటే ఆయన వంటింటి ముఖం చూసి ఎరగరు కాబట్టి. అది చూసి ఆయన...

“అదేమిటే బాబూ గ్రామదేవతలాగా కళ్ళు అలా పెట్టేవు? భయమేస్తోంది, ప్రసన్నమైపో” అంటూ నన్ను భుజాలు పట్టుకుని ఊపసాగారు.

“స్వామీ మీకు ఈ విధమైన దుర్బుద్ధి పుట్టుటకు గల కారణము ఏమి? అందులకేనా వేసవికాలము ఫిబ్రవరిలోనే వచ్చేసినది?” అంటూన్న నన్ను వింతగా చూస్తూ..

“ఇదేనోయ్ ఆడాళ్ళతో వచ్చిన చిక్కు. మగాడేదైనా మంచి పనిచేస్తానంటే, దీని వెనకేదో నిగూఢ రహస్యం వుందని అనుమానిస్తారు. అసలు అసూయ, అనుమానం ముందు పుట్టి, ఆడది తరువాత పుట్టిందనుకో” అంటున్న ఆయన్ను కుడి అరచేత్తో ఆపి- “ఇప్పటికి మన పెళ్ళయ్యాక ఎన్ని వందలసార్లు ఈ మాటలు అన్నారో. ఇక చాలించండి స్వామీ” అన్నాను.

అప్పుడు ఆయన -

“గౌతమబుద్ధుడికి బోధివృక్షం క్రింద జ్ఞానోదయం అయినట్లు, నాకు మీ తమ్ముడింటి నుండి వచ్చేక, గ్లాసులో పంచదార నీళ్ళు, నిమ్మరసం వేసి గిలకొట్టినట్లుగా బ్రెయిన్ వాష్ అయిపోయిందోయ్. ఈ స్త్రీలకు మనం ఏదైనా చేయాలనిపించిందోయ్”

“ఇక మీ ఉపన్యాసం ఆపండి. అదీ సంగతి. వాడు నా తమ్ముడండీ. భార్యను ఎలా చూసుకోవాలో బాగా తెలిసినవాడండీ. నా బంగారుకొండ” అంటున్న నా మాటలు ఆపుచేసి -

“అయితే నేను?” అంటూ క్వశ్చన్ మార్కు ముఖం పెట్టిన ఆయన్ను “మీరూ మంచివారే! అయితే మా తమ్ముడు ఇంకొంచెం ఎక్కువ మంచివాడు. అయితే ఏమిటంటారు?”

“చూశావా మీ తమ్ముడి దాంపత్యం. ఆ పిల్ల వెనకాలే తిరుగుతూ, ఆ పిల్లని ఏ పనీ చేయనివ్వకుండా, అన్నీ తనే చేసేస్తాడు. పాపం ఆ పిల్ల నిర్ఘాంతపోయి ఇదేం మొగుడురా బాబూ అనుకుంటూ నిశ్చేష్ట అయిపోతుంది. ఆ పిల్ల అవస్థ చూడలేకపోయాననుకో. అయినా పెళ్ళయిన కొత్తల్లో ప్రతీ మగాడూ, పెళ్ళాం కొంగుపట్టుకుని, అయస్కాంతానికి ఇనుప రజను అతుక్కుపోయినట్లుగా తిరగడం మామూలే అనుకో” ఆయన మాటలకు అడ్డువచ్చి-

“అయితే మా తమ్ముడు కొన్నాళ్ళు పోయేక పెళ్ళానికి సాయం చెయ్యడనా మీ వుద్దేశ్యం” అన్నా కోపంగా.

“తప్పయిపోయింది దేవీ మీ తమ్ములుంగారిని దూషించితిని” అంటూ కొంటెగా నన్ను చూస్తున్నారాయన. ఏం...?” అన్నారాయన.

స్టార్ హోటల్స్‌లో నోరూరిస్తున్న నలభీములు అనే ఆర్టికల్ చదువుతున్నాను.

ఇంతలో ఆయన గబగబా వచ్చి “కుక్కర్ పెట్టి అర గంటైంది. ఇంకా విజిల్ రాలేదేమిటే” అంటూ వచ్చారు.

పరుగున వెళ్ళి చూద్దునుగదా కుక్కర్ క్రిందనుండి నల్లగా మాడిపోయి, పేలడానికి రెడీగా వుంది. కుక్కర్‌లో నీళ్ళు పొయ్యకుండా బియ్యం, పప్పు పెట్టేసేరులా వుంది. వెంటనే స్టౌ ఆర్పేసి ఊపిరి పీల్చుకున్నాను.

“మీకు పుణ్యం వుంటుంది. మనం ఇద్దరం, ఇలా కులాసాగా సంతోషంగా ఎక్కువ కాలం బ్రతకాలంటే, మీరు వంటింటివేపు రాకుండా వుంటే మంచిదని నాకు అనిపిస్తోంది” అని ఆయన్ను హాలులోకి పంపించి మాడిపోయిన కుక్కర్‌ని తోముకోవడం మొదలెట్టాను. వంటిల్లు కడుక్కోలేక, కుక్కర్ తోముకోలేక, పూడుకుపోయిన సింక్ బాగుచేసుకోలేక, ఈయనగారి వంటతో ఛస్తున్నాననుకోండి.

ఆయన మనసులో మార్పుకు మా తమ్ముడు కారణం కావడం నాకు ఉన్నపళంగా టి.వి.షోలో పట్టుకుంటే పట్టుచీర వచ్చినంత సంబరమైంది.

ఒకరోజు ఆయన నాకన్నా ముందు లేచి కాఫీ పెట్టి నాకు అందివ్వాలని అనుకున్నారో ఏమో, పాలు స్టౌవ్ మీద పెట్టి, ఈలోగా పేపరు వస్తే దానిలో మునిగిపోయారు. వంటింట్లోంచి పొగలు వస్తుంటే, వెళ్ళి చూద్దును కదా! పాలు ఆవిరి అయిపోయి, స్టీలుగిన్నె మాడిపోయి, మంట రావడానికి సిద్ధంగా వుంది.

“అయ్యయ్యో నీకు ఇవ్వాళ కాఫీ ఇచ్చి నిన్ను సర్‌ప్రైజ్ చేయాలనుకున్నానోయ్. ఇదేమిటి ఇలా జరిగింది...” అంటున్న ఆయనకు రెండు చేతులూ జోడించి కోపంతో-

“మహానుభావా మీ సాయం వద్దు, చట్టుబండలూ వద్దు గాని, ఇంకొంచెం ఆలస్యమైతే గిన్నెలోకి మంట వచ్చి గ్యాస్‌స్టౌవ్ అంటుకొని ఇల్లు పేలిపోయేది. అసలే అద్దెకొంప కూడానూ” కోపంతో అంటున్న నన్ను ప్రసన్నం చేయడానికి...

“నీ పిచ్చిగాని, ఇల్లు పేలిపోతే మనం వుంటావేమిటోయ్. పోనీలే వంటలో సాయం చేస్తానులే” అన్నారు.

ఇలా రోజులు గడుస్తుండగా ఆ వేళ శెలవు.

“నేను కుక్కర్‌లో అన్నం, పప్పూ వండేస్తాను ఒకేసారి, ఆ తరువాత ఇద్దరం కలిసి సాంబార్ పెడదాం. నువ్వు కాస్సేపు ఆదివారం సప్లిమెంట్ చదువుకో

ఇలా వుండగా ఒకరోజున “ఏమోయ్ ఒక వీక్లీలో వెన్నచెక్కలు అనే వంట పడిందోయ్. నువ్వు బియ్యప్పిండితో పప్పుచెక్కలు చేస్తావ్‌గా, అలాగాకుండా వెన్నచెక్కలు. ఇవి వెరైటీగా వున్నాయి. నేను మధ్యాహ్నం శెలవు పెట్టి వచ్చాను. ఇదిగో కటింగ్ తెచ్చాను” అంటూ వచ్చారు శ్రీవారు, చేతిలో వెన్న ప్యాకెట్ వుంది.

ఇక చేసేదేముంది... ఇద్దరం వంటింట్లోకి వెళ్ళాం. “ఆయన వెంటనే నన్ను ఆపి, నువ్వు అలా చూస్తూండు. నాకు అడ్డు తగలకు. రుచి చూడ్డానికి మాత్రమే నువ్వు రావాలి” అంటున్న ఆయన్ను, నాకు గతంలో జరిగిన దుఃఖానుభవాలు గుర్తుకు వచ్చి “నేను ఏం చేయనులెండి. చూస్తుంటాను” అన్నాను.

“సరే. నాకు సామాన్లు అందించు” అన్నారాయన. గబగబా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి షార్ట్ వేసుకుని వచ్చి, ఫైవ్ స్టార్ హోటల్‌లో షెఫ్ ఫోజు పెట్టి...

పెసరపప్పు, కందిపప్పు, చాయమినప్పప్పు, శనగపప్పు, వేరుశెనగ పప్పు తలా ఒక కప్పునేతిలో వేయించాలి, కమ్మని వాసన వచ్చేవరకూ. కమ్మని వాసన వచ్చేసింది. ఆ తరువాత మిక్సీలో పిండి చేయాలి ఇవన్నీ..అలాగే చేశారు.

‘జీడిపప్పును సన్నగా తురిమి ఆ పిండిలో కలిపి ఒక కప్పు వెన్న ఆ పిండిలో వేసి, అవసరమైతే నాలుగు చుక్కలు నీరు వేసి గట్టిగా ముద్దచేసి, స్టౌవ్‌మీద మూకుడు పెట్టి, నెయ్యి వేసి, కాగేక ముద్దలోంచి చిన్న




వుండ తీసి అరచేతిలో చిన్నచెక్కలా చేసి కాగిన నెయ్యిలో వేసి, అది లేత ఎరుపురంగులో వేగేక, మీ గొంతులో వేసుకొని చూడండి. అది వెంటనే మీ గొంతులో కరిగిపోయి, క్షణంలో జారిపోతుంటే, ఆ రుచి చూసిన తన్మయత్నంలో కళ్ళు మూసుకుంటారు' అంటూ చదువుతూ ఆయన అవన్నీ చేస్తున్నారు.

కాగిన నేతిలో వేసిన చెక్క తియ్యదానికి, చట్రం పెట్టారాయన. నేతిలో ముంచిన చట్రం బయటకు తీస్తే ఏమీ బయటకు రాలేదు. "అదేమిటీ వెన్న చెక్క ఏదే బాబూ" అన్నారాయన.

‘ ‘ అ ేస ల ం వేశారా?" అన్నా న్నేను.

తల ఊపారు వేశానన్నట్లుగా.

నేను కంగారుగా పొయ్యి దగ్గరకు వెళ్ళి చూద్దును గదా, నెయ్యిలో చెక్క పూర్తిగా మాయమై పోయి, నెయ్యంతా పిండితో నిండిపోయి, పావు కిలో నెయ్యి కాస్తా ఆగమైపోయింది.

స్టౌ అంతా జిడ్డు, సింక్ అంతా నెయ్యి, వంట చేసే స్టౌ చుట్టూ జిగట జిగట. పిండితో నిండిపోయింది. నాకు కోపం నషాళానికి అంటుకుంది. అది చూసి ఆయన జాలిగా ముఖం పెట్టి -

"అది కాదే నాకు పప్పుచెక్కలంటే ఇష్టం కదా, నీకు తెలుసును కదా బావుంటాయని ట్రై చేశాను. ఇలా అయిందేమిటి?" అంటున్న ఆయన్ను కోపం, జాలి కల బోసి చూసి-

"మహానుభావా! ముందు మీరు బయటకు వెళ్ళండి. లేదంటే ఆఫీసుకు వెళ్ళిపోండి. మాయమేళం, వెన్నచెక్కలూ, నా బొంద చెక్కలూ" అంటూ విసుక్కుం టున్న నాకు ఆ పేపర్ కటింగ్ చూపించి "ఇదిగో చూడు అంతా వాడు రాసినట్లే చేశాను" అన్నారు.

వంటిల్లంతా శుభ్రం చేసుకునేటప్పటికి నా తల ప్రాణం తోకకు వచ్చినట్లయింది. 'అసలు మగాళ్ళు హాయిగా హాలులో కూర్చుంటేనే బెస్ట్. ఇలా వంటిం ట్లోకి వచ్చి ప్రయోగాలు చేస్తే ఇలాగే వుంటుంది' అనుకుంటూ ఆయన ఇచ్చిన పేపర్ కటింగ్ చూద్దును కదా, బాలకృష్ణ రాష్ట్ర ముఖ్య మంత్రి, జూనియర్ యన్టీఆర్ ప్రధాన మంత్రి, చంద్రబాబు రాష్ట్రపతి అయిన ట్లుగా వార్త చూస్తే ఎంత మండిపోతుందో, అలా మండిపోయింది నాకు.

వెంటనే హాలులో పేపరు చదువుకుం టున్న ఆయన దగ్గరకు వెళ్ళి, కాన్వెంట్‌లో హోమ్‌వర్క్ చేయకపోతే, విద్యార్థిని చెవి పట్టుకున్న టీచర్‌లాగా, ఆయన చెవి పట్టుకుని, మెలితిప్పుతూ "ఇదిగో ఈ పేపర్‌లో వెన్న ఎంత వెయ్యాలని రాసి వుందీ..." అంటున్న నన్ను "అబ్బ వద లవే చెవి నొప్పిగా వుందీ.." అంటూనే పేపరు కటింగ్ చూసి "ఒక టేబుల్ స్పూన్ వెన్న" అని పైకి చదివారా యన.

"మరి కప్పుడు వెన్న తగలబెడితే చెక్కలేం కనిపిస్తాయి. వెన్న రుచికి వాటికి కడుపుబ్బి సంతోషంతో మాయమై చచ్చాయి. మాయ దారి సంబడం. ఇక నుండి వంటింటి ఛాయలకు వచ్చా రంటే నేనూరుకోను తెలిసిందా" అంటున్న నా వేపు చూస్తూ-

"శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజ నేయం" అంటూ కళ్ళు మూసుకుని దండకం చదువుతున్న ఆయన చెవి వదిలి "ఏం నేను రాక్షసిలా కనిపిస్తు న్నానా?" అన్నాన్నేను.

"మరేం... రేపు నువ్వు నాకు వెన్నచెక్కలు చేసిపె ట్టాలి"

"అదిగో మళ్ళీ" అంటూ ఆయన ఇంకో చెవి పట్టు కోబోతుంటే పారిపోయారాయన.